క్లుప్తంగా

వైభవంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



సబ్బవరంలో పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న రెవన్యూ సిబ్బంది

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తొలగించారు. సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 260లో ఆక్రమణలను తహసీల్దార్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య సిబ్బందితో కలిసి పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడినా, నిర్మాణాలు చేపట్టినా ల్యాండ్ గ్రేబింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణలు తొలగించిన వారిలో వీఆర్వో రుక్మిణి తదితరులు ఉన్నారు.

లారీ డ్రైవర్ల ఆందోళన



జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న డ్రైవర్లు

సబ్బవరం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సబ్బవరంలోని బాటజంగాలపాలెం టోలుగేట్ వద్ద జయహో రథసారథి డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్. ముత్యాలనాయుడు, పూడి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. రూ.7 లక్షల జరిమానా లేదా 10 సంవత్సరాలు జైలు శిక్ష విధించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం డ్రైవర్లపై ఒత్తిడి పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ,అనకాపల్లి జిల్లాల సభ్యులు సంయుక్తంగా నిరసన చేపట్టినట్టు తెలిపారు.కార్యక్రమంలో బాట జంగాలపాలెం సభ్యులు,తోటి డ్రైవర్లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



పారిశుధ్య కార్మికుడిని సత్కరిస్తున్న రామునాయుడు

పరవాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు పిలుపునిచ్చారు. పెదముషిడివాడలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో రామునాయుడు మాట్లాడారు. ప్రపంచంలో భారత్‌ను సంపన్న దేశంగా నిలబెట్టడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, బీజేపీ మండల అధ్యక్షుడు పిళ్లా సతీష్, సర్పంచ్ పల్లా నాగమణి, కబడ్డీ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ దేశానికే ఆదర్శం

- భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు , అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- అడవివరం, పెందుర్తిలో వైఎస్సార్ పింఛన్ కానుక సంబరాలు



పింఛన్లు అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: సామాజిక పింఛన్ నెలకు రూ. 3 వేలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. నియోజకర్గం పరిధిలోని 98వ వార్డు బాలాజీనగర్‌లోని ప్రైవేటు కల్యాణ మండపం లోశుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు.

నాటికి.. నేటికీ ఎంతో తేడా

టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షల మందికి పింఛన్లు ఇచ్చేవారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 68 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. 98వ వార్డు పరిధిలో1903 మందికి నెలకు రూ. 57లక్షలు లక్షలు అందిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వారి వర్గానికి చెందిన వారికే పింఛన్ ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పింఛన్ అందించడం జరిగిందన్నారు. ప్రజలు టీడీపీ ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తేడా తెలుసుకోవాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే వలంటీర్ల భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వజోన్ జెడ్సీ మల్లయ్యనాయుడు, ఏపీడీ శ్రీరామ్, వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, లోగిశ మాధవరావు, అక్కిరెడ్డి అప్పారావు, ఎస్.కృష్ణ, శిడగం తాతబాబు, లండ రమణ,టి.రాము, మధురెడ్డి, ఎన్.అప్పారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆనందమని 'పింఛన్'

పెందుర్తి: డాక్టర్ వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుదపై సర్వాత్రా హర్షం వ్యక్తమవుతోంది. పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పెందుర్తి గ్రామీణ మండలానికి చెందిన పింఛన్ దారులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో..వారికి ఎం చేయాలో నిరంతరం ఆలోచించే వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో హుస్సేన్‌సాహెబ్, ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 95వ వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ ముమ్మన దేముడు పింఛన్లు పంపిణీ చేశారు.
- స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మధుపాడ నాగమణి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

పండగలా పింఛన్ల పంపిణీ

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో వైఎస్సార్ పింఛన్లను శుక్రవారం పండగ వాతావరణంలో పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ 617 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, సచివాలయ కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డు మెంబర్లు సబ్బవరపు శ్రీనివాసరావు, కొల్లి దాసు,జక్కాన శ్రీనివాసరావు,బోకం జగదీశ్వరరావు, ఎం. పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

93వ వార్డులో..

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు 491 సచివాలయం పరిధిలోని విరాట్‌నగర్‌లో పలువురి లబ్ధిదారులకు పెరిగిన పింఛన్ నగదు రూ.3 వేలను శుక్రవారం వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ అందజేశారు. కార్యక్రమంలో 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, రమేష్, శ్రీకాంత్, గోషా, కనకరాజు, వెంకటేశ్, హర్ష, శరత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



95వ వార్డులో పింఛన్లు అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



పింఛన్లు అందిస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి



వైస్ ఎంపీపీ గోవింద్‌తో కలిసి పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు



పింఛన్ నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ 93వవార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ

శ్రీశారదాపీఠాన్ని సందర్శించిన గుంతి మాత



స్వామీజీతో ముచ్చటిస్తున్న గుంతి మాత

పెందుర్తి: హర్యానా రాష్ట్రం కురుక్షేత్రకు చెందిన గుంతి ఆశ్రమ నిర్వాహకురాలు గుంతి మాత శుక్రవారం విశాఖ శ్రీశారదాపీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిశారు. పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గుంతి మాతకు పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సాదరస్వాగతం పలికారు. ఆమె మూడు రోజుల పాటు పీఠంలో బస చేయనున్నారు.

రేపు అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మహాజనసభ

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 9.45గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల షేర్‌ధనంపై చెల్లించే వడ్డీ , త్రిప్ట డిపాజిట్లకు వడ్డీ చెల్లించే విషయాలపై ఆమోదం తెలిపే అంశాలతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించి సభలో చర్చించనున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరు కావాలని స్వామి కోరారు.

పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- విజినిగిరిపాలెంలో ఉత్సాహంగా గడపగడపకు ..
- జనసేన నాయకుడి కుటుంబానికి రూ.52 వేల లబ్ధి



విజినిగిపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ముత్తంశెట్టి

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, త్వరలోనే పరిష్కారం అవుతుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 98వవార్డు విజినిగిరిపాలెంలో శుక్రవారం రాత్రి ముత్తంశెట్టి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమపథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ ఆక్రమణ దారులు కాదని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పంచ గ్రామాల్లో ఇళ్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ విషయంలో దేవస్థానం నుంచి ఏమైనా ఇబ్బందులు ఉంటే తాను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. అలాగే భూసమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి స్వామి, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, మజ్జి ధర్మా, ఆర్.వర్మ, లోగిశ మాధవరావు, ఎన్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు అమలు

పార్టీలు, వర్గాలు, కులాలు చూడకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేశారని ముత్తంశెట్టి తెలిపారు. దీనికి ఉదాహరణే విజినిగిరిపాలెంలో ఉన్న జనసేన నాయకుడు మజ్జి శ్రీనివాసరావు భార్య మజ్జి రాజేశ్వరికి అందిన సంక్షేమ ఫలాలని తెలిపారు. ఆమెకు అమ్మఒడి కింద రూ. రూ.29వేలు, సున్నా వడ్డీ కింద రూ.4672, వైఎస్సార్ ఆసరా కింద రూ.18836 కలిపి మొత్తం రూ.52,508 అందాయని తెలిపారు. పార్టీలకతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందన్న విషయానికి ఇదే నిదర్శనమని ముత్తంశెట్టి చెప్పారు.

గంగవరం కార్మికుల ఆందోళన

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



గంగవరం పోర్టు లోపల బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు లోపల రైల్వే ట్రాక్ గేటుతో పాటు బొట్ గేటు వద్ద వీరంతా బైఠాయించారు.

వెంటనే వేతన బకాయిలు చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో యాజమాన్య ప్రతినిధులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, బందోబస్తు నిర్వహించారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గరికిన నూకరాజు అనే కార్మికుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారని, అయితే అతనికి కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు యాజమాన్యం నిరాకరించిందన్నారు. కార్మికులంటే యాజమాన్యానికి చిన్నచూపు తగదన్నారు. వెంటనే యాజమాన్యం తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపారు. తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 20వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్య రక్ష

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- వైద్య సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం
- పినగాడి శిబిరానికి పోటెత్తిన ప్రజలు
- 456 మందికి వైద్య సేవలు



పినగాడిలో మందులు పంపిణీ చేస్తున్న భగవాన్ జయరాం, ఇన్‌చార్జి వైద్యాధికారి పద్మావతి

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని పినగాడి గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్ చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలన్న తలంపుతో ఈ బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. నిరుపేదలు వైద్యానికి, విద్యకు ఇబ్బందులు పడకూడదన్న ఆలోచనతో ఆయా రంగాలకు పెద్దపీట వేశారని చెప్పారు. సీఎంగా వైఎస్ జగన్ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 456 మంది శిబిరంలో సేవలు పొందారు. వీరిలో 268 మందికి సాధారణ వైద్య పరీక్షలు, 30 మందికి కంటి పరీక్షలు, 124 మందికి ఎముకల వైద్య పరీక్షలు, 8 మంది గర్భిణులు, నలుగురు పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. 16 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నారు. నలుగురికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ పాల పద్మావతి, డాక్టర్ బండారు రమేష్, స్పెషలిస్ట్ డాక్టర్లు రేవతి, రాజు, ఎంపీహెచ్‌ఈవో ఎం.పరమేశ్వరరావు, పర్యవేక్షకులు ఈశ్వరరావు, కల్యాణమ్మ, ఆశ కార్యకర్తలు సేవలు అందించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పద్మావతి



రక్త పరీక్షల కోసం నమూనా తీసుకుంటున్న వైద్య సిబ్బంది

ఉచితంగా మందులిచ్చారు



ఒంట్లో బాగోపోతే పెందుర్తి వెళ్లాల్సి వచ్చేది. పెద్ద ఆరోగ్య సమస్య అయితే కేజీహెచ్‌కు వెళ్లేవాళ్లం. ఉదయం వెళితే సాయంత్రం తిరిగి వచ్చేవారం. కానీ ఇప్పుడు జగన్‌బాబు దయ వల్ల మా గ్రామానికే వైద్యులందరూ వచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తున్నారు. మందులు ఖర్చు తగ్గడం చాలా ఆనందంగా ఉంది.

– గొర్లి చిన్నారావు, పినగాడి

పంటి నొప్పికి వైద్యం



చాలాకాలంగా పంటి నొప్పితో బాధపడుతున్నాను. చాలా సార్లు ప్రైవేటు ఆస్పత్రికి తిరిగి చాలా ఖర్చు అయింది. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చూపించుకున్నాను. ఆ మందులతో చాలావరకు ఊరట వచ్చింది. మళ్లీ పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నాను. ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల మాలాంటి వాళ్లకు సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుంది.

– మందా సావిత్రి

ఆరోగ్యానికి భరోసా కల్పించారు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోగ్యానికి భరోసా కల్పించారు. చిన్నపాటి వైద్యం కూడా చేయించుకోలేని నిరుపేదలకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. అన్ని రక్త పరీక్షలు ఉచితంగా చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగకరం. ఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగించాలి.

– బండి అప్పారావు, పినగాడి

విశ్వశాంతికి ఆధ్యాత్మిక కార్యక్రమాలు



అఖండ యోగా భట్టి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీస్

పరవాడ: విశ్వంలో శాంతి, లోక కల్యాణం కోసం వాడ వాడలా అఖండ యోగా భట్టి కార్యక్రమాలు నిర్వహించాలని రాజయోగిని బి.కె.రమా అన్నారు. వాడచీపురుపల్లి బి.కె. పాఠశాలకు చెందిన రాజయోగినులు బి.కె.వేణి, బి.కె.సోమేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అఖండ యోగ భట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయడు మాట్లాడారు. విశ్వశాంతి కోసం రెండు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీలు వచ్చి వాడచీపురుపల్లిలో అఖండ తపస్సు చేయడం ప్రజల భాగ్యంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి శాఖ బి.కె. ఆదిలక్ష్మి, రాజయోగినులు బి.కె. అపరంజి, సత్య, శ్యామల, మమత, విమల, శశి, గంగాధర్‌రావు, కె.అప్పలనాయుడు, డాక్టర్ కె.ప్రభాకర్‌మూర్తి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్ : స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడుతో 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ–మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు శత శాతం రుణాలు అందించేందుకు బ్యాంకులకు అనుసంధానం చేసి టార్గెట్‌పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటా..



ఆటో కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న కాశీ విశ్వనాథనాయుడు

పరవాడ: ఆటో కార్మికులకు అండగా ఉంటానని పెందుర్తి మాజీ జెడ్పీటీసీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కంచిపాటి కాశీ విశ్వనాథనాయుడు అన్నారు. పరవాడ మండలంలో ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా కంచిపాటి రాము చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ఆటో యూనియన్ల సభ్యులకు యూనిఫారాలు అందజేశారు. పరవాడలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు చేతులు మీదుగా ఆటో కార్మికులకు యూనిఫారాలు అందజేశారు.